క్లుప్తంగా

న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్



నందిగామరూరల్: న్యాయవాదుల రక్షణకు అడ్వకేట్ ప్రొటెక్ట్ యాక్ట్‌ను తీసుకురావాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు డిమాండ్ చేశారు. బాపట్లలో న్యాయవాది విజయకుమార్‌పై దాడిని ఖండిస్తూ స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై ఇటువంటి చర్యలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కన్నెగంటి జీవరత్నం, బండి మల్లికార్జునరావు, మట్టా ప్రసాద్, యర్రంరెడ్డి బాబురావు, పెసరమల్లి సురేస్, వరదబోయిన విజయ్‌కుమార్, స్టాలిన్‌బాబు, కొమ్మినేని మౌలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: బాపట్ల బార్ అసోసియేషన్ న్యాయవాది టి.విజయకుమార్‌పై పోలీసుల అక్రమ చర్యలను నిరసిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసనలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు దాసరి నాగేశ్వరరావు, గోనెల వెంకటేశ్వర్లు, ఎం.ఆంజనేయులు, జి.శ్రీనివాసగౌడ్, మన్నెం మురళి, పూల నాగరాజు, రావూరి ప్రసాద్, ఎం.మనోహర్, గురువులు రాజు, అశోక్, నరేష్, పల్లపు రవి, బిక్షమయ్య, జ్యోత్స్న, అమ్ములు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరణ



నందిగామటౌన్: ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతిఒక్క సమస్యను పరిష్కరించేలా అన్ని చర్యలు తీసుకుంటానని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్ ప్రారంభించారు. ముందుగా అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో గణనాథుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు గజ్జి కృష్ణమూర్తి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేటఅర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులంతా తప్పక హాజరుకావాలని కోరారు.

రూ.50వేలు ఆర్థిక సాయం



చందర్లపాడు(నందిగామటౌన్): గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చందర్లపాడు మండలం కాండ్రపాడు లోని గ్రామ పెద్దలు, వైఎస్సార్ సీపీ యూత్ సభ్యులు కలిసి పేద విద్యార్థులకు శుక్రవారం రూ. 50వేలను ఆర్థికసాయంగా అందజేశారు. తొలుత వినాయక మంటపంలో పూజలు చేశారు. అనంతరం విజయవాడలో ఇంటర్మీడియట్ చదువుతున్న గ్రామానికి చెందిన అవుకు అశోక్‌కు రూ.25వేలు, కమతం వెంకటరెడ్డి కుమారులు వెంకటేష్, రాఘవరెడ్డిలకు రూ.25వేలను వారి కుటుంబసభ్యులకు అందజేశారు. విద్యార్థులకు ఆర్థిక సాయం అందించిన యువత, గ్రామపెద్దలకు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామపెద్దలు కొండా కృష్ణారెడ్డి, కమతం భాస్కర్‌రెడ్డి, ఎస్‌కె గాలిబ్‌సాహెబ్, మంగునూరి లక్ష్మీరెడ్డి, కానాల భద్రారెడ్డి పాల్గొన్నారు.

పత్తికి వర్షం దెబ్బ

- ఎర్రబారుతున్న మొక్కలు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం



వర్షాలకు నీరు నిల్వ ఉండి ఎర్రబడుతున్న పత్తి మొక్కలు

పెనుగంచిప్రోలు: మూడురోజులుగా ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలు పత్తి పంటకు ప్రతికూలంగా మారాయి. అధిక వర్షాలకు చేలల్లో నీరు నిలిచి రోజుల తరబడి నాని ఉండటంతో ఆ ప్రభావం దిగుబడులపై పడనుంది. తేమ కారణంగా సమగ్ర పోషకాలు అందక ఎర్రబారడమే కాకుండా పూత, కాయలు రాలిపోతున్నాయి. ఫలితంగా దిగుబడి తగ్గి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చికి ఆశించిన ధర లేక ఈఏడాది రైతులు పత్తితోపాటు మొక్కజొన్న, సుబాబుల్ సాగుకు ప్రాధాన్యమిచ్చారు. జిల్లాలో సాధారణ పత్తి సాగు విస్తీర్ణం 36,254 హెక్టార్లు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 78,662 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు సాగుచేసిన పత్తిలో సుమారు 55వేల ఎకరాల మేర పత్తిపంట తీవ్ర ప్రభావానికి గురైందని సమాచారం. ఈ వర్షాల దెబ్బకు పత్తిలో పూత, పిందెల రాలుతుండటంతో దిగుబడి బాగా తగ్గనుంది.

కొంపముంచిన వాన..

పత్తిని కొందరు రైతులు మెట్టపంటగా, మరికొందరు వర్షాధారంగా, ఇంకొందరు రైతులు నీటివనరులు ఉన్నభూముల్లో సాగుచేస్తుంటారు. ఈ ఏడాది పత్తి మొక్కలు నాటిన తరువాత కొన్నిగ్రామాల పరిధిలో వర్షాలు లేక మొక్కలు ఎండిపోవడంతో, రైతులు మరోసారి నాటారు. జూలై నెలతోపాటు ఈనెలలో వరుసగా వారంరోజులపాటు వర్షాలు విస్తారంగా పడటంతో పూత, పిందెదశలో ఉన్న పంటపై తీవ్రప్రభావాన్ని చూపాయి. రోజులు తరబడి నీరు నిలిచి తేమ పెరగగా మొక్కకు సమగ్రపోషకాలు అందక ఎర్రబారాయి. అంతేగాక రసం పీల్చే పురుగు ఆశిస్తోందని రైతులు చెబుతున్నారు. అధిక వర్షం కారణంగా కలుపు కూడా పెరుగుతోందని రైతులు అంటున్నారు.

భారీగా తగ్గనున్న దిగుబడులు..

అధిక వర్షాలు పంట దిగుబడులపై ప్రభావం చూపే పరిస్థితి కనిపిస్తోంది. చాలాచోట్ల పూత, పిందె రాలిపోగా దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరు నిల్వ ఉండే పల్లపు ప్రాంతాల్లో పత్తి బాగా దెబ్బ తినడంతో దిగుబడులు బాగా తగ్గిపోనున్నాయి. సహజంగా ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి దెబ్బతిన్న పొలాల్లో సగానికి తగ్గేలా ఉందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం దెబ్బకు అదనపు పెట్టుబడి...



ఈనెల మొదటివారం వరకు పత్తి ఆశాజనకంగా ఉంది. పూత, పిందె దశలో ఉన్న పంటను భారీ వర్షాలు దెబ్బతీశాయి. దీంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. పైర్లు తిరిగి కోలుకోవాలంటే అదనంగా పెట్టుబడి పెట్టక తప్పేలా లేదు.

– రమేష్, రైతు, ముచ్చింతాల

సమగ్ర యాజమాన్యచర్యలు పాటించాలి



సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వర్షానికి దెబ్బతిన్న పత్తి పంటలో తిరిగి పురోగతి సాధించవచ్చు. వర్షపు నీటిని కాల్వల ద్వారా బయటకు పంపించడంతోపాటు ఎకరానికి 20కిలోల యూరియా, 15 కిలోల ఎంఓపీ(మ్యూరేట్ ఆఫ్ పొటాష్)వేస్తే నైట్రోజన్, పొటాష్ కొరత తీరుతుంది. యూరియా(2శాతం) లేదా మల్టీ కే(ఒకశాతం)ద్రావణం పిచికారీ చేస్తే మొక్కకు త్వరగా పోషకాలు అందుతాయి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు లేదా ఒక గ్రాము కార్బెండిజం, 25 గ్రాముల మాంకోజెబ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవలి. వడల తెగులు గమనించినట్లయితే కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములను లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్ల తడిచేలా పోయాలి.రసం పీల్చే పురుగు నివారణకు పిఫ్రానిల్ లేదా ఎసిటామిప్రిడ్ మందు పిచికారీ చేయాలి.

– కె రామసుబ్బారెడ్డి, ఏఓ, పెనుగంచిప్రోలు

నిమజ్జనాలకు భక్తులు సహకరించాలి : ఏసీపీ

వేదాద్రి(జగ్గయ్యపేట): గణనాథులను కృష్ణానదిలో నిమజ్జనాలకు తీసుకువచ్చే భక్తులు పోలీసులకు సహకరించాలని గణపతి ఉత్సవాల ప్రత్యేక ఏసీపీ వెంకటేశ్వర్లు సూచించారు. వేదాద్రిలో కృష్ణానది వద్ద సాగుతున్న నిమజ్జన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కమిటీ సభ్యులకు సూచించారు. నదిలో వరద ఉధృతి అధికంగా ఉన్నందున పంటు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతరమతాలు, వర్గాలు, వ్యక్తులను కించపరిచేలా వ్యవహరించకుండా భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిమజ్జన కార్యక్రమాలు జరుపుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్, ట్రైనీ ఎస్ఐ మణికంఠ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శిగా వేల్పుల రమేష్



కంచికచర్ల : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కంచికచర్ల మండలం కీసర గ్రామానికి చెందిన వేల్పుల రమేష్‌ను పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేంద్రపార్టీ కార్యాలయం నుంచి రమేష్‌కు నియామక పత్రం అందింది.ఈ సందర్భంగా రమేష్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్సీ అరుణకుమార్, రమేష్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. రమేష్ వెంట ఆయన సతీమణి, కంచికచర్ల జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ ఉన్నారు.

మిర్చి తోటల పరిశీలన



మిర్చి పొలాల పరిశీలన అనంతరం రైతుతో మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి వర్ధిని

పెనుగంచిప్రోలు: ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నిలిచిన నీరును వెంటనే బయటకు పంపించాలని ఉద్యానవన శాఖాధికారి వర్ధిని సూచించారు. పెనుగంచిప్రోలులోని మిర్చి తోటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిర్చితోటల్లో నిల్వ ఉన్న నీటిని సాధ్యమైనంత వరకు బయటకు పంపించాలన్నారు. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లూదా యూరియా వంటి పోషకాలు పిచికారీ చేయాలన్నారు. అంతర సేద్యం ద్వారా నేల ఆరేటట్లు చేసుకోవాలన్నారు. పొలంలో నీరు నిల్వ ఉంటే ఎండు తెగులు వచ్చే అవకాశం ఉందని, దీని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా మెటా లాక్సిల్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదట్లో వేసుకోవాలని సూచించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బన్‌డిజం ఒక గ్రాము లేదా మాంకోజెబ్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



వత్సవాయి మండలం దేచుపాలెంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పేట బ్రాహ్మణబజారులో పూజలు చేస్తున్న అర్చకుడు



డాంగే నగర్‌లో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు



పేట చెరువుబజారులో ఏర్పాటు చేసిన 26 అడుగుల గణనాథుడు

జగ్గయ్యపేటఅర్బన్: చవితి ఉత్సవాలలో జగ్గయ్యపేట పట్టణంలోని ఆయా వినాయక మంటపాల్లోని గణనాథులకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో 15వవార్డు చెరువు బజారులోని నీళ్ల ట్యాంకుల వద్ద కోటి ఫ్రెండ్స్ యూత్ ఏర్పాటు చేసిన 26అడుగుల గణేష్ విగ్రహం ప్రత్యేకాకర్షణగా నిలిచింది.

తన్నీరు ప్రత్యేకపూజలు..

పట్టణంలోని 2వ వార్డు డాంగేనగర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన వినాయక మంటపంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు బజారు సాయి, నియోజకవర్గ ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షుడు దర్శి వెంకటేశ్వర్లు, మండల యూత్ అధ్యక్షుడు సయ్యద్ షాఉద్దీన్, పట్టణ ప్రధానకార్యదర్శి పింగళి నర్సింహరెడ్డి, పట్టణ యూత్ ప్రధానకార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, నాయకులు గింజుపల్లి శివరాం, కె.తిరుపారెడ్డి, చింతల కాశేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా రైతుబజారు, డాంగేనగర్‌లోని పెద్దాయనవీధి మండపాల్లోని గణనాథులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: గణపతి నవరాత్రులను గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు శుక్రవారం మూడవ రోజు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. దంపతులు పీటలపై కూర్చుని పూజాక్రతువులు నిర్వహించారు. గణపతి విగ్రహాల వద్ద రాత్రి సమయంలో పూజలు అయ్యాక, స్వామివారి చేతిలో ఉంచిన లడ్డూను వేలంపాట నిర్వహించారు. అనంతరం కోలాటాలు, చిన్నపిల్లల డ్యాన్సులు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: మండలంలోని చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలకు శుక్రవారం విశేష పూజలు చేశారు. పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయంతోపాటు నవాబుపేట, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు తదితర గ్రామాల్లోని నవరాత్రుల పందిరి వద్ద భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మంటపాలలో వినాయకుడికి భక్తులు శుక్రవారం విశేష పూజలు చేశారు.ధర్మవరప్పాడుతండ, పోచంపల్లి, బండిపాలెం, చిల్లకల్లు, షేర్‌మహ్మద్ పేట, అనుమంచిపల్లి గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులను నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆయా రూపాల్లో ఉన్న గణనాథులను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా మంటపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.



అనిగండ్లపాడులో వినాయకుడి విగ్రహం వద్ద భక్తులు



రైతుబజారులోని వినాయక మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే తాతయ్య



పేట బ్రాహ్మణబజారులో మహిళా భక్తుల సందడి

శాంతించని వైరా-కట్టలేరు

వరద ఉధృతికి నీట మునిగిన పంట పొలాలు



సంగమేశ్వర స్వామి ఆలయ పరిసరాలలోకి చేరిన వరద నీరు



వీరులపాడులో ఆర్‌అండ్‌బీ రహదారిపై నిలిచిన వరద నీరు

నందిగామరూరల్: ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు కురుస్తున్న వర్షాలకు వాగులు, చెరువులు పొంగిపొర్లుతుండగా శుక్రవారం కూడా వైరాకట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది.వరద కారణంగా దాములూరు కూడలి వద్ద వైరాకట్టలేరు సుమారు 10 అడుగుల మేర ప్రవహిస్తూ సమీపంలోని సంగమేశ్వరస్వామి ఆలయానికి అతిచేరువగా వచ్చింది. దీంతో ఆలయ పరిసరాలు వరద నీటితో దర్శనమిస్తున్నాయి. వరద ఉధృతికి దాములూరు, కూడలి, గోళ్లమూడి, సోమవరం, రుద్రవరంతో పాటు ఏటిపట్టు గ్రామాలలోని పంట పొలాలు నీట మునిగాయి. మాగాణి పంట పొలాలు చిన్నపాటి చెరువులను తలపిస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షం తెరపివ్వడంతో పంట పొలాలలో నిలిచిన నీటిని బయటకు పంపే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

పలు గ్రామాలకు రాకపోకలు బంద్

వీరులపాడు: రెండురోజులపాటు ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాలకు వీరులపాడు మండలంలోని వాగులు, వంకలు పొంగడంతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ఈ వర్షాలకు వైరా-కట్టలేరు పరివాహక ప్రాంతంలోని దొడ్డదేవరపాడు, జయంతి, వీఅన్నవరం, వీరులపాడు, పల్లెంపల్లి, కొణతాలపల్లి, వెల్లంకి, తాటిగుమ్మి, నందలూరు, గోకరాజుపల్లి గ్రామాల పరిధిలోని వేలాది ఎకరాలలో సాగుచేసిన మొక్కజొన్న, వరి, పెసర, మినుము, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఏనుగు గడ్డ వాగు పరిధిలోని పెద్దాపురం, నరసింహారావు పాలెం, చెన్నారావుపాలెం, రంగాపురం, జుజ్జూరు, అల్లూరు గ్రామాల్లోని పంటలు సైతం వరద తాకిడికి నీట మునిగాయి. వరద ముంపునకు గురై అవస్థలు పడుతున్నా వ్యవసాయాధికారులు కనీసం పంట పొలాల వైపు కన్నెత్తి చూడలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వరద ప్రవాహాన్ని పరిశీలించిన అధికారులు..

పల్లంపల్లి వద్ద వైరా-కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పల్లంపల్లి నుంచి వీరులపాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపైకి భారీగా వరద నీరు చేరింది. వరద ప్రవాహాన్ని తహసీల్దార్ రవికుమార్, ఎస్ఐ అనిల్‌కు పరిశీలించి ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ మార్గంలో రాకపోకలను నిలుపుదల చేశారు. వెల్లంకి–కొణతాలపల్లి మధ్య కూడా రాకపోకలు నిలిచిపోయాయి. వీరులపాడులోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ అంతా వరద నీటితో నిండిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

వృద్ధులకు అందని రేషన్ బియ్యం

కంచికచర్ల: వృద్ధులకు ఇంటికి వెళ్లి రేషన్‌బియ్యం పంపిణీ చేస్తామన్న కూటమి ప్రభుత్వ హామీ మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. కంచికచర్ల మండలంలోని రేషన్ డీలర్లు వృద్ధులకు ఇళ్లకు వెళ్లి రేషన్ సరుకులు ఇవ్వడం లేదు. రేషన్ బియ్యం ఇంటికి వస్తాయనే ఆశతో ఎదురుచూస్తున్న వృద్ధుల ఆశ నిరాశగానే మిగిలింది. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే సరైన సమాధానం చెబుతుండటం గమనార్హం. ఈనెలాఖరు వరకు రేషన్ బియ్యాన్ని ఇళ్లవద్దకు వెళ్లి పంపిణీ చేసే ప్రసక్తే లేదని డీలర్లు వ్యాఖ్యానిస్తుండటంతో వృద్ధులు లబోదిబోమంటున్నారు. స్మార్ట్ రేషన్‌కార్డులను కూడా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయకుండా, లబ్ధిదారులే రేషన్‌దుకాణం వద్దకు వచ్చి తీసుకువెళ్లాలని పలువురు డీలర్లు వ్యాఖ్యానిస్తుండటంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో రేషన్‌కార్డుదారుల ఇబ్బందులను 'సాక్షి' దినపత్రిక కంచికచర్ల తహసీల్దార్ నరసింహారావు దృష్టికి తీసుకువెళ్లేందుకు ఫోన్ చేయగా, ఆయన ఫోన్ స్పందించడం లేదు. ఓ వైపు కృష్ణానది, మునేరు, కట్టలేరు, వైరా ఉపనదులకు వరదలు వస్తున్న సమయంలో కూడా తహసీల్దార్ ఫోన్‌లో అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కంచికచర్ల మండలంలో వృద్ధులకు రేషన్ బియ్యం పంపిణీ చేసేలా డీలర్లకు ఆదేశాలు జారీచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



చందాపురంలో తెలుగు ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



పెనుగంచిప్రోలులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పేట జెడ్పీ పాఠశాలలో గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నందిగామరూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కరించారు. అదేవిధంగా వాసవీ సిల్వర్ స్టార్ క్లబ్ ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చల్లా వెంకట నరసయ్య, నకిరికంటి వెంకటేశ్వరరావు, పులిపాటి వెంకటేశ్వరరావు, దుడ్డు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: అమ్మ అనే పిలుపులోనే కమ్మదనం ఉంటుందని హెచ్‌ఎంలు నక్కా బాబూరావు, కె.జలజ పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి రామ్మూర్తి పంతులు చేసిన సేవలను కొనియాడారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థులు తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన మహానుభావుల చిత్రపటాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, చేగు విద్యాలయంలో శుక్రవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగురామ్మూర్తి చిత్రపటానికి హెచ్‌ఎం కె.హేమమాధవి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఆర్.సుబ్బలక్ష్మి, జె.శారద, వ్యాయామ ఉపాధ్యాయులు వై.లక్ష్మికుమారి, బి.సునీత పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు

వీరులపాడు: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని, ఫోక్సో చట్టంపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులు సూచించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మహిళల హక్కులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ ఆజాద్, కొమ్మినేని మౌలేశ్వరరావు, కోయ దివ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా కమిటీ నియామకం

జగ్గయ్యపేటఅర్బన్: షాదీఖానా చైర్మన్‌గా సయ్యద్ షాబుద్దీన్, సభ్యులుగా షేక్ జాన్ సైదా, గౌసియాబీ, ఖాసిం, షేక్ జానీ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య శుక్రవారం కమిటీ సభ్యులకు అందజేశారు. మేకా వెంకటేశ్వర్లు, సయ్యద్ అన్వర్, షేక్ మదార్ సాహెబ్, షేక్ అస్లాం పాల్గొన్నారు.